
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం, 25, ఏప్రిల్, 2023



టన్ను చీనీ రూ.38 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను ధర గరిష్టంగా రూ.38,000 పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.5.50
అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట రూ.5.50 ప్రకారం పలికినట్లు ఏడీఎం సత్యనారాయణ చౌదరి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
41.4°/23.7°

జిల్లా పరిధిలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత తీవ్రంగానే ఉంది. అక్కడక్కడా వర్షం కురిసింది.


న్యూస్‌రీల్

జిల్లా జైల్లో 27న వేరుశనగ చెక్క వేలం



బుక్కరాయసముద్రం: అనంతపురం జిల్లా జైలులో ఈ నెల 27న వేరుశనగ చెక్క వేలం నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ జైళ్ల శాఖ ఉప శాఖాధికారి కడప రేంజ్ వారి సమక్షంలో ఆ రోజు ఉదయం 11 గంటలకు 20వేల కేజీల వేరుశనగ చెక్క వేలం వేస్తామని, ఆసక్తి ఉన్న వారు రూ.17,600 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లిస్తామని తెలిపారు.

గైర్హాజరైన అభ్యర్థులకు 27న కౌన్సెలింగ్



ప్రశాంతి నిలయం: కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన 48 మంది డీఎస్సీ -98 అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. కాంట్రాక్ట్ పద్ధతిలో మినిమం టైం స్కేల్‌తో సెకెండ్ గ్రేడ్ టీచర్‌గా పనిచేసేందుకు అర్హత సాధించి ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారికి ఈనెల 27న అనంతపురంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన అభ్యర్థులు మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, హాల్ టికెట్, గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరించిన ఒరిజినల్ విద్యార్హత పత్రాలు తీసుకుని వెళ్లాలని ఆమె సూచించారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం



ఆదిశేషు (ఫైల్)

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గరుడంపల్లి సమీపంలోని వంక మలుపు వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణంలోని యాధవ వీధికి చెందిన సుబ్బమ్మ, వెంకటశివ దంపతుల కుమారుడు ఆదిశేషు (28) బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేసుకుంటున్నాడు. ఆదివారం తన స్నేహితులు రవితేజ, మంజులతో కలిసి శ్రీశైలానికి కారులో బయలుదేరాడు. కారు గరుడంపల్లి వంక మలుపు వద్దకు చేరుకోగానే అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆదిశేషు అక్కడికక్కడే మృతి చెందగా రవితేజ, మంజులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనంతపురం సవేరా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆదిశేషు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాయినామం..భక్త పరవశం

- ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవాలు
- పంచరత్న కీర్తనలతో మార్మోగిన ప్రశాంతి నిలయం
- హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ
- 30 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాల వితరణ



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: సత్యసాయి నామంతో ప్రశాంతి నిలయం ప్రతిధ్వనించింది. సాయి కుల్వంత్ సభా మండపంలో చేరిన అశేష భక్తకోటి సాయి స్మరణతో పరవశించింది. సత్యసాయి ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వేడుకల్లో దేశ విదేశాల భక్తులు పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు వేదపఠనంతో వేడుకలు ప్రారంభంకాగా, సత్యసాయి మిర్‌పురీ కళాశాల విద్యార్థులు సత్యసాయిని కీర్తిస్తూ పంచ రత్న కీర్తనలు ఆలపించారు. కర్ణాటక సంగీత రీతిలో సత్యసాయిపై భక్తిప్రపత్తులను చాటుతూ సాగిన కచేరీతో భక్తులు మైమరచిపోయారు. విద్యార్థుల భక్తిరస కచేరీతో సాయికుల్వంత్ సభామందిరం ఆధ్యాత్మిక పరిమళాలతో నిండిపోయింది.

బోధన మననం చేసుకోవడమే ఆరాధన

ఆరాధనోత్సవాల్లో భాగంగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద భక్తులనుద్దేశించి ప్రసంగించారు. శ్రవణం, మననం, ఆచరణం మూడింటినీ కలిగి ముందుకు సాగడమే ఆరాధన అన్నారు. ప్రతి సాయి భక్తుడూ తాము విన్న సత్యసాయి బోధనలను మననం చేసుకుంటూ నిత్యజీవితంలో ఆచరించడమే సరైన ఆరాధన అన్నారు. భక్తులపై సత్యసాయి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. అనంతరం సత్యసాయి ఎవరు అన్న సారాంశంతో కూడిన 'త్వమేవ చరణం మమ' అన్న పుస్తకాన్ని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు నాగానంద, జేవీ శెట్టి, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, దేశీయ అధ్యక్షుడు నిమీష్ పాండే ఆవిష్కరించారు. సత్యసాయి పూర్వపు ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌లపై వినిపించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మహానారాయణ సేవలో 30 వేల మంది

సత్యసాయి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. కరోనా కారణంగా మూడేళ్లుగా నిలిచిపోయిన నారాయణ సేవను ఈ ఏడాది ఆరాధనోత్సవాలతో ట్రస్ట్ తిరిగి ప్రారంభించింది. పుట్టపర్తి పరిసర గ్రామాలకు చెందిన 30 వేల మంది భక్తులు ఉదయం నుంచే హిల్‌వ్యూ స్టేడియానికి చేరుకున్నారు. భక్తులు ఎండవేడిమి వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ట్రస్ట్ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటలకు అన్నదాన కౌంటర్ల వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి చిత్రపటం వద్ద ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యులు నాగానంద, జేవీ శెట్టి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహానారాయణ సేవను ప్రారంభించారు. ట్రస్ట్ సభ్యులు భక్తుల వద్దకు వెళ్లి స్వయంగా అన్న ప్రసాదాలు, నూతన వస్త్రాలను వితరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 400 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

సత్యసాయి ఆశయ సాధనే ట్రస్ట్ లక్ష్యం

సత్యసాయి ఆశయ సాధనే లక్ష్యంగా సెంట్రల్ ట్రస్ట్ ముందుకు సాగుతోందని, అందులో భాగంగా సత్యసాయి చేపట్టిన ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగిస్తోందని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు తెలిపారు. మహా నారాయణ సేవ అనంతరం ఆయన మాట్లాడుతూ, కరోనా కారణంగా మూడేళ్ల తర్వాత నారాయణ సేవ తిరిగి ప్రారంభించామన్నారు. భక్తులు సత్యసాయిపై అదే నమ్మకం, విశ్వాసంతో నారాయణ సేవకు తరలివచ్చారన్నారు. సత్యసాయి ట్రస్ట్ ఏపీ ప్రభుత్వంతో కలసి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ అందిస్తోందని, ఇందుకు ఏటా రూ.45 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. శతజయంతి జరుపుకునే 2025 సంవత్సరం ఏడాది పొడవునా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలను నిర్వహించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకునేందుకు ప్రశాంతి నిలయానికి వచ్చే భక్తులకు నిత్య అన్నదానం పథకం ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు.



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



భక్తులకు అన్న ప్రసాద వితరణ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

మలేరియా నిర్మూలనకు చర్యలు చేపట్టండి



మలేరియా నిర్మూలన దినోత్సవం పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: దోమల వల్ల వ్యాపించే మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఈనెల 25వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మలేరియా వ్యాధి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వీధులు, రోడ్లపై మురుగు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. అలాగే డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, డీపీఎంఓ కుల్లాయప్పనాయక్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్ బాధిత కుటుంబానికి రూ.51 లక్షల చెక్కు అందజేత

ఉద్యోగరీత్యా కువైట్‌కు వెళ్లి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన ఎన్‌పీ కుంటకు చెందిన హసనాపురం మౌలాలి కుటుంబానికి కలెక్టర్ అరుణ్‌బాబు రూ.51,41,008 చెక్కును అందజేశారు. హసనాపురం బాషా కుమారుడు మౌలాలి 2017 మే 5న కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అక్కడి ఇండియన్ రాయభార కార్యాలయ కార్యదర్శి మౌలాలి కుటుంబానికి రూ.51,41,008 పరిహారం మంజూరు చేశారు. ఆ చెక్కును సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో బాషాకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో 'స్పందన' ఆడిటింగ్

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మండల స్థాయిలో ఆడిటింగ్ బృందాలు ఏర్పాటు చేసి కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి 'స్పందన'లో అందిన అర్జీల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం ఆయన డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖతో కలిసి కలెక్టరేట్‌లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తంగా 201 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్పందన హాలు నుంచే డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు స్పందనలో పాల్గొని సమష్టిగా అర్జీలు పరిష్కరించాలన్నారు. అధికారులు అందించే ఎండార్స్‌మెంటు అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఉండాలన్నారు. సామూహిక గృహ ప్రవేశాల్లో భాగంగా మే నెల రెండో వారం నాటికి జిల్లాకు కేటాయించిన 10,658 ఇళ్లు పూర్తి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలైన సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. చిన్నారుల ఆధార్ అప్‌డేట్ పూర్తి చేయాలన్నారు. అలాగే ఉపాధి హామీ పథకం కింద 65 వేల మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యం నిర్దేశించగా, ప్రస్తుతం 59 వేల మంది మాత్రమే పనులకు వస్తున్నారని, వారంలోపు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. 'అమృత్ సరోవర్' పథకం కింద ఇంకా 48 చెరువుల్లో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. రీ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్ కింద 2 వేల రాళ్లు జిల్లాకు వచ్చాయని, రెండు రోజుల్లోపు వాటిని నాటాలన్నారు. కార్యక్రమం అనంతరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ప్రవీణ్‌కుమార్ 'ఏ డ్రగ్ ఫ్రీ స్టేట్' అంటూ అధికారుల చేత ప్రమాణం చేయించారు. డ్రగ్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి అధికారులంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఎస్‌వి కృష్ణారెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

సీఐ ఆధ్వర్యంలో 'దిశ' అర్జీల పరిష్కారం



మహిళల సమస్యలను తెలుసుకుంటున్న దిశ సీఐ లక్ష్మణ

'దిశ'కు వచ్చిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ఇందుకు స్పందన హాలులోనే అధికారులు ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. దీంతో 'దిశ' సీఐ లక్ష్మణ వెంటనే 'స్పందన'కు వచ్చిన పలువురు మహిళలతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. అక్కడి నుంచే సదరు మహిళలను ఇబ్బంది పెడుతున్న కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

దివ్యాంగుడి వద్దకే వచ్చి...



శ్రీనివాసులు సమస్యను తెలుసుకుంటున్న డీఆర్‌ఓ కొండయ్య

ధర్మవరం పట్టణం కొత్తపేటకు చెందిన శ్రీనివాసులు అనే దివ్యాంగుడు స్పందనలో కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు వచ్చాడు. మెట్లు ఎక్కలేక హాలు బయటే ఉండిపోయాడు. వీల్ చైర్‌లో వచ్చిన అతన్ని గమనించిన కలెక్టర్ అరుణ్‌బాబు పక్కనే ఉన్న డీఆర్‌ఓ కొండయ్యను అతని వద్దకే పంపాడు. తనకు రెండు కాళ్లు లేవని, ఏ పనీ చేయలేని తనకు భార్య, కుమారుడు పోషణ ఇబ్బందిగా మారిందని దివ్యాంగుడు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీఐ చదివిన తన కుమారుడికి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని పుట్టపర్తి విమానాశ్రయానికి రానున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా కలిసి కోరుతానని, ఇందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. స్పందించిన డీఆర్‌ఓ ఏ విషయమూ మంగళవారం తెలియజేస్తామని, అతని ఫోన్ నంబర్ తీసుకున్నారు.

రేపు సీఎం పర్యటన



- షెడ్యూల్ విడుదల చేసిన ప్రభుత్వం
- నార్పలలో 'వసతి దీవెన' కార్యక్రమం
- లబ్ధిదారులతో సీఎం జగన్ ముఖాముఖి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26న జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గం నార్పల మండల కేంద్రంలో నిర్వహించనున్న జగనన్న వసతిదీవెన కార్యక్రమంలో పాల్గొని కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ చేస్తారు. సీఎం పర్యటన షెడ్యూల్‌ను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. బుధవారం ఉదయం 9.45 గంటలకు సీఎం జగన్ శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి అనంతపురం జిల్లా నార్పలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 10.20 గంటలకు చేరుకుంటారు. 10.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయల్దేరి నార్పల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి 10.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని 10.55 గంటల వరకు సందర్శిస్తారు. 11 గంటలకు సభా వేదికపైకి చేరుకుని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి జగనన్న వసతి దీవెన కార్యక్రమం ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జగనన్న వసతి దీవెన మెగా చెక్కును విడుదల చేస్తారు. మధ్యాహ్నం 12.35 గంటలకు సభాస్థలి వద్ద నుంచి బయల్దేరి హెలిప్యాడ్‌కు 12.45 గంటలకు చేరుకుంటారు. అక్కడే స్థానిక నాయకులతో 1.05 గంటల వరకు మాట్లాడతారు. 1.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 1.40 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయల్దేరి వెళతారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

విజయవంతం చేయాలి

శింగనమల/ నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం సభా ప్రాంగణం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ఘనంగా స్వాగతం పలికేందుకు శింగనమల నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లను సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి సోమవారం పరిశీలించారు. అలాగే హెలిప్యాడ్‌ను కలెక్టర్ గౌతమి, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ కేతన్‌గార్గ్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

పంచాయతీలే ప్రగతికి సోపానాలు

- కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలోని 8 పంచాయతీలకు 'ఉత్తమ' అవార్డులు
- సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాల అందజేత

పుట్టపర్తి అర్బన్: పంచాయతీలే ప్రగతికి సోపానాలని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఎనిమిదింటిని 'ఉత్తమ' పంచాయతీలుగా ఎంపిక చేసి సంబంధిత సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, విద్యావంతులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చేస్తారన్నారు. అధికారులు కూడా ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలన్నారు. ఉత్తమ పంచాయతీల్లో ఆయా విభాగాల్లో చొరవ చూపిన సిబ్బందిని ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, జిల్లా డీపీఓ విజయ్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎల్‌డీఓలు శివారెడ్డి, బాలాజీ, శివకుమారి పాల్గొన్నారు.

ఎంపికైన పంచాయతీలు

- పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనలో బత్తలపల్లి మండలం అప్రాచెరువు ఎంపిక కాగా, సర్పంచ్ శారదమ్మ, కార్యదర్శి అలివేళమ్మను సత్కరించారు.
- చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీగా చిలమత్తూరు మండలం కొడికొండ ఎంపిక కావడంతో సర్పంచ్ లక్ష్మీ దేవమ్మ, కార్యదర్శి నాగరాజును సత్కరించారు.
- హెల్దీ పంచాయతీగా ఎంపికైన గోరంట్ల మండలం వానవోలు సర్పంచ్ శ్రీరాములు, కార్యదర్శి బాబాజాన్‌ను సత్కరించారు.
- సెల్ఫ్ సఫిషియెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో తనకల్లు మండలం బొంతలపల్లి ఎంపిక కాగా, సర్పంచ్ లత, కార్యదరి ఉదయ్‌కుమార్‌ను సత్కరించారు.
- సోషియల్లీ సెక్యూర్డ్ విభాగంలో నల్లచెరువు మండలం తవలంమర్రి సర్పంచ్ మల్లికార్జునమ్మ, కార్యదర్శి విజయ్‌కుమార్‌లను సత్కరించారు.



ధర్మవరం మండలం గొట్లూరు సర్పంచ్ నరసమ్మకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్ విభాగంలో తలుపుల పంచాయతీ ఎంపిక కాగా, సర్పంచ్ శ్రీలత, కార్యదర్శి మాధవరెడ్డిను సత్కరించారు.
- చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం పంచాయతీ ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో ఎంపిక కాగా, సర్పంచ్ రామాంజనేయులు, కార్యదర్శి అనిల్‌కుమార్ తరపున పంచాయతీ అధికారులను సత్కరించారు. ఈ పంచాయతీకి ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డు దక్కడం విశేషం.
- వాటర్ సఫిషియెంట్ విభాగంలో ధర్మవరం మండలం గొట్లూరు పంచాయతీ ఎంపిక కాగా, సర్పంచ్ నరసమ్మ, కార్యదర్శి గణేష్‌రెడ్డిలను సత్కరించారు.

ఆర్గానిక్ మందుల సీజ్

నల్లమాడ: పంటల సాగుకు ముందు తామిచ్చే ఆర్గానిక్ మందును చల్లితే అధిక దిగుబడులు వస్తాయని మభ్యపెట్టి కొందరు మందులు విక్రయిస్తున్నట్లు తెలిసి అధికారులు దాడులు చేశారు. స్థానిక మారుతీ బజార్‌లోని ఓ ఇంట్లో ప్రభుత్వ అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 'కిసాన్ పవర్' ఫార్ములా ఆర్గానిక్స్ అండ్ న్యాచురల్స్ గుళికలను అధికారులు సీజ్ చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు సోమవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్, వీఆర్‌ఓ వాసుదేవ రెడ్డి, ఏఎస్‌ఐ సురేంద్ర, మండల వ్యవసాయాధికారి సుమతి తదితరులు మందులు నిల్వచేసిన ఇంటిపై దాడిచేశారు. వరండాలో 71 డబ్బాల్లో నిల్వ ఉంచిన 710 కిలోల గుళికల మందును సీజ్ చేశారు. ఇంట్లో మరికొన్ని డబ్బాల్లో మందులు నిల్వ ఉన్నట్లు స్థానికులు చెప్పగా, ఇంటికి తాళం వేసి ఉండటంతో దాన్ని సీజ్ చేశారు. అధికారులు దాడుల సమయంలో మందులు విక్రయిస్తున్న వారెవరూ అక్కడ లేకపోవడంతో మందుల డబ్బాలను ఏఓ స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా ఆర్గానిక్స్ మందు పేరుతో గుళికలు విక్రయిస్తున్న వారిపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏఓ సుమతి తెలిపారు.



మందుల డబ్బాలను చూపుతున్న అధికారులు

క్లుప్తంగా

బాబా అవతార ప్రకటన క్షేత్రంలో ప్రత్యేక పూజలు



రాతిగుండుకు విశేష అలంకరణ చేసిన దృశ్యం

ఉరవకొండ: ప్రపంచ దేశాలకు ప్రేమతత్వాన్ని చాటి నడియాడే దేవుడిగా ఖ్యాతిగాంచిన భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన క్షేత్రంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. సత్యసాయి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని ఉరవకొండలోని బాబా అవతార ప్రకటన క్షేత్రం భక్తులతో పోటెత్తింది. బాబా అవతార ప్రకటన చేసిన రాతిగుండును విశేష పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు, భజనలు,పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

జగనన్నే మళ్లీ రావాలంటున్నారు

- మాజీ ఎమ్మెల్యేలకు సెల్ఫీల పిచ్చి పట్టింది
- మోదీ చలువతోనే కియా పరిశ్రమ ఏర్పాటు
- గొల్లపల్లి రిజర్వాయర్‌కు ప్రాణం పోసింది మహానేత వైఎస్సార్
- జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాలగుండ్ల



మాట్లాడుతున్న మాలగుండ్ల శంకరనారాయణ

పెనుకొండ: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారంటూ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. ఇందుకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న అపూర్వ స్పందనే నిదర్శమన్నారు. స్థానిక తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో చేపట్టి 15 రోజులు దాటిందన్నారు. ఈ నెల 7న చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సహకారంతో దిగ్విజయంగా కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకూ 1.60 కోట్ల కుటుంబాలను కలసి సీఎం వైఎస్ జగన్ పాలనపై అభిప్రాయాలు సేకరించారని, ఇందులో అత్యధికులు మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే రావాలనే ఆకాంక్షను బలంగా వ్యక్తపరిచారన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని 70 వేల కుటుంబాలను సర్వే చేస్తే అందరూ జగన్ సర్కార్‌కు మద్దతు తెలిపారన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కొనియాడారన్నారు. టీడీపీ బలంగా ఉన్న ప్రాంతంలోనూ జగనన్న పాలన కావాలని ప్రజలు నినదిస్తున్నారన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

జగనన్న పాలనపై టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు సాగిస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మబోరాదని ప్రజలకు శంకరనారాయణ పిలుపునిచ్చారు. చంద్రబాబు సెల్ఫీ తీసుకున్నాడు కాబట్టి తాము కూడా తీసుకోవాలన్న వింత జబ్బు టీడీపీ నేతలకు, మాజీ ఎమ్మెల్యేలకు సోకిందని ఎద్దేవా చేశారు. గొల్లపల్లి రిజర్వాయర్‌ను చంద్రబాబే తీసుకువచ్చాడంటూ సవితమ్మ సెల్ఫీ దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల చంద్రబాబు పాలనలో రిజర్వాయర్ నిర్మాణానికి ఇచ్చింది కేవలం రూ.9 కోట్లు మాత్రమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చలువతోనే ఈ రిజర్వాయర్ పూర్తయిందనేది అక్షర సత్యమన్నారు. హంద్రీనీవా కాలువ, రిజర్వాయర్ నిర్మాణానికి డాక్టర్ వైఎస్సార్ రూ.5,400 కోట్లు ఇచ్చిన విషయాన్ని టీడీపీ నాయకులు మరవరాదన్నారు. అలాగే కియా కార్ల పరిశ్రమ వద్ద, పెనుకొండ కొండ రోడ్డుకు ఒక్క రూపాయి కూడా ఇవ్వని నాటి ఎమ్మెల్యే... నేడు పూర్తి చేసిన కొండ రోడ్డు వద్దకెళ్లి సెల్ఫీ దిగి తానే పూర్తి చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం సిగ్గుచేటన్నారు. బొల్లిబాబును చూసి కియా పరిశ్రమ రాలేదని, ప్రధాని మోదీ చలువతోనే పరిశ్రమ ఏర్పాటైందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు ఎకరాకు రూ.9 లక్షలు ఇచ్చి, చదునుకు ఎకరాకు రూ.30 లక్షలు ఖర్చు చూపి చంద్రబాబు, లోకేష్, బీకే పార్థసారథి భారీ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. తాము చేయని పనుల వద్ద పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి సెల్ఫీలు దిగి వైరల్ చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. 2019కు ముందు, ఆ తర్వాత జరిగిన అభివృద్ధిపై దమ్ముంటే టీడీపీ నాయకులు శ్వేత పత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నాగలూరు బాబు, బోయ నరసింహ, సోమందేపల్లి కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరత్నం, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ సునీల్, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ముఖ్య నాయకులు రామ్మోహన్‌రెడ్డి, రామాంజినేయులు, వెంకటరామిరెడ్డి, భాస్కర్‌నాయక్, గోపాల్‌రెడ్డి, గుట్టూరు నారాయణస్వామి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండలరాయుడు, మాజీ సర్పంచ్ రాజగోపాలరెడ్డి, సోమశేఖరరెడ్డి, మారుతి పాల్గొన్నారు.

గురుకుల కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్: మండలంలోని గుండుమలలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ యు.మురళీధర్‌రావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల విద్యార్థులు మే నెల 18వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులకు మే 28న ప్రవేశ పరీక్ష ఉంటుంది. జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తారు. అర్హత సాధించిన విద్యార్థులు జూన్ 14 నుంచి 17వ తేదీలోపు కేటాయించిన కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. ఎంపీసీలో 60 సీట్లు, బైపీసీలో 40, సీఈసీలో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయి. పూర్తి వివరాలకు 90002 73302, 90306 26109లో సంప్రదించవచ్చు.

మద్యం విక్రేత అరెస్ట్

తాడిమర్రి: మండలంలోని చిల్లవారిపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అంజుగుట్టు వెంకటశివారెడ్డిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అందిన ముందస్తు సమాచారం మేరకు ఏఎస్ఐ వనప్ప, సిబ్బంది.. చిల్లవారిపల్లికి చేరుకుని వెంకటశివారెడ్డి నిర్వహిస్తున్న దుకాణంలో తనిఖీలు చేపట్టారు. పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. దీంతో వెంకటశివారెడ్డిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

గుండెపోటుతో రెవెన్యూ ఉద్యోగి మృతి



గురుదత్తప్రసాద్ (ఫైల్)

నల్లచెరువు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గురుదత్తప్రసాద్ (55) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. తనకల్లు మండలం ముళ్లోళ్లపల్లికి చెందిన ఆయన వృత్తి రీత్యా ఎంతో సామ్యుడిగా ఖ్యాతి గడించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రమణారెడ్డి, నల్లచెరువు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది... గురుదత్తప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

ఇండియన్ ఉమెన్ లీగ్ ఫుట్‌బాల్ కోచ్‌గా అంజలి



అనంతపురం సప్తగిరి సర్కిల్: ఇండియన్ ఉమెన్స్ లీగ్ ఫుట్‌బాల్ గోల్ కీపర్ కోచ్‌గా కళ్యాణదుర్గానికి చెందిన అంజలి ఎంపికయ్యారు. ఇండియన్ ఉమెన్స్ లీగ్ క్రీడా పోటీలు ఈ నెల 26 నుంచి మే 13వ తేదీ వరకూ అహమ్మదాబాద్ వేదికగా జరగనున్నాయి. ఈ పోటీల్లో అందరి దృష్టిని కేంద్రీకృతం చేసుకున్న ముంబయి నైట్స్ క్లబ్ జట్టుకు ఆమె కోచ్‌గా వ్యవహరించనున్నారు. అనంతపురం ఫుట్‌బాల్ అకాడమీలో బాలికల కోచ్‌గా పనిచేస్తున్న అంజలికి అరుదైన అవకాశం దక్కడంపై ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్డీటీ ఫుట్‌బాల్ అకాడమీ కో–ఆర్డినేటర్ దాదాఖలందర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఏపీఆర్ఎస్ దరఖాస్తు గడువు పెంపు

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో 5, 6, 7, 8 తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు తుది గడువును ఈ నెల 28వ తేదీ వరకూ పొడగించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన ఇచ్చినట్లు గుర్తు చేశారు. అయితే దరఖాస్తుదారులకు వెసులుబాటు కల్పిస్తూ మరో నాలుగు రోజుల గడువు పెంచుతూ ఏపీ గురుకుల విద్యాలయాల సొసైటీ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

వివాహిత ఆత్మహత్య

ముదిగుబ్బ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బ మండలం బూదనంపల్లికి చెందిన కప్పల రాజమ్మ (35)కు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున దంపతులిద్దరూ గొడవపడ్డారు. దీంతో విసుగు చెందిన ఆమె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మిద్దెపై పడుకున్న భర్త, పిల్లలు తెల్లారిన తర్వాత కిందకు దిగి వచ్చి చూడగా అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం.. చిన్నారికి గాయాలు



గాయపడిన విష్ణువర్ధన్

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు బీసీ కాలనీ అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. తండ్రి నవీన్ తెలిపిన మేరకు.. సోమవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రానికి తమ కుమారుడు విష్ణువర్ధన్‌ను తల్లిదండ్రులు పంపారు. మధ్యాహ్నం ఆడుకుంటూ బాలుడు కింద పడడంతో తలకు గాయమైంది. ఎడమ చెయ్యి విరిగింది. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు వెంటనే సెంటర్‌కెళ్లి ఘటన ఎలా జరిగిందంటూ ఆరా తీయగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో కుమారుడిని హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి పిలుచుకు వచ్చారు. కాగా, సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త అందుబాటులో లేకపోవడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. సిబ్బందిపై చర్యలకు డిమాండ్ చేశారు.

రాష్ట్ర స్థాయి హాకీ విజేత విశాఖ



విశాఖ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం అర్బన్: స్ఫూర్తిదాయకమైన ఆటతీరును ప్రదర్శించినప్పుడు క్రీడాకారుడికి గుర్తింపు దక్కుతుందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో నాలుగు రోజులుగా సాగుతున్న 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల పురుషుల హాకీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజు జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో విశాఖపట్నం, ఎన్టీఆర్, తిరుపతి జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌ల్లో విశాఖ జిల్లా విన్నర్స్ ట్రోఫీని కైవశం చేసుకుంది. రన్నరప్‌ను ఎన్టీఆర్ జిల్లా దక్కించుకుంది. మూడో స్థానంలో తిరుపతి జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీలను, తన సొంత నిధుల నుంచి నగదు పురస్కారాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అందజేశారు. రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించిన వారికి జ్ఞాపికలను ప్రదానం చేసి, అభినందించారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, ఉపాధ్యక్షుడు బంధనాథం సూర్యప్రకాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ చైర్మన్లు భాగ్యలక్ష్మి, పెనుజూరు నాగరాజు, జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి అంజన్న, ప్రతినిధులు చందు, అరవింద్‌గౌడ్, కోచ్ హుస్సేన్, సీనియర్ క్రీడాకారులు మారుతీమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహాసమాధిని దర్శించుకున్న జిల్లా అధికారులు



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని మహాసమాధిని కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణపై సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజుతో చర్చించారు. కాగా, ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన కలైమామణి గాయత్రి గిరీష్ బృందం సంగీత కచేరి భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

ఆదర్శ పథం.. అగ్రస్థానం

- విమెన్ ఫ్రెండ్లీగా మేడాపురం పంచాయతీ
- రాష్ట్ర స్థాయి అవార్డుపై సర్వత్రా హర్షం



మేడాపురం గ్రామం

చెన్నేకొత్తపల్లి: సమాజం మేలు కోసం ఏం చేసినా ఫలితం తప్పక వస్తుందంటారు. ఇందుకు తగ్గ కృషి చేసిన వారి సేవలకూ గుర్తింపు దక్కుతుందంటారు. అలాంటి ఉత్కృష్ట సేవలతో చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ఖ్యాతి గడించి పురస్కారానికి ఎంపికైంది. ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో దక్కిన ఈ పురస్కారాన్ని సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ అందుకున్నారు.

సమష్టి కృషి ఫలితం

ఈ అవార్డు దక్కడం వెనుక గ్రామ సర్పంచ్, కార్యదర్శితో పాటు సచివాలయ ఉద్యోగుల కృషి ఎంతో ఉంది. పంచాయతీలో 7,143 మంది జనాభా ఉండగా, 3,685 మంది పురుషులు, 3,458 మంది మహిళలు ఉన్నారు. 14 మంది వార్డు సభ్యులకు గాను ఏడుగురు మహిళలే ఉండడం గమనార్హం. మహిళలను అక్షరాస్యులుగా చేయడం, వివిధ అంశాల్లో వారిని చైతన్యవంతులను చేయడంలో అధికారులు విజయం సాధించారు. మహిళలకు ఆర్థికంగా సహకారం అందిస్తే ఎలాంటి అభివృద్ధి సాధిస్తారో చక్కటి ఉదాహరణగా నిలిచారు.

మెరుగైన సేవలతోనే..



పంచాయతీలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ, ప్రజారోగ్యం వంటి ప్రాధాన్య అంశాల్లో ప్రజలకు గరిష్టంగా సేవలు అందిస్తున్నాం. గ్రామ సభల్లో ప్రజలు లేవనెత్తే అంశాలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. వితంతువులు, దివ్యాంగులు, మహిళలు, బాలలపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తున్నాం.

– అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి, మేడాపురం

గర్వపడుతున్నా



ఉమెన్ ఫ్రెండ్లీ విభాగంలో మా పంచాయతీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కడంపై సర్పంచ్‌గా నేను గర్వపడుతున్నా. అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేత, చట్టాలపై మహిళలకు అవగాహన, మహిళలపై అత్యాచారాలు నియంత్రించడం తదితర అంశాల్లో పంచాయతీ ముందు వరుసలో నిలవడం ఎంతో సంతోషంగా ఉంది. గ్రామస్తులు, స్థానిక సచివాయల సిబ్బంది సహకారం మరువలేను.

– రామాంజనేయులు, సర్పంచ్, మేడాపురం

మొక్కు తీర్చుకునేందుకు వచ్చి యువకుడి మృతి



మృతుడు వెంకటేశ్వర్లు

తలుపుల: అమ్మవారికి మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... తలుపుల మంలడం గంజివారిపల్లికి చెందిన వెంకటనారాయణ కుమారుడు ఎస్.వెంకటేశ్వర్లు (33), వీణ దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసవెళ్లిన వెంకటేశ్వర్లు... అక్కడే స్థిర నివాసముంటూ సూపర్ మార్కెట్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో గంగమ్మ ఆలయంలో మొక్కు తీర్చుకునేందుకు నాలుగు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలసి వచ్చాడు. ఆదివారం అమ్మవారికి మూడు మేకపోతులు బలిచ్చి, బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం గుండెల్లో నొప్పిగా ఉందంటూ బాధపడుతున్న వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు హుటాహుటిన తలుపుల పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో కుటుంబసభ్యులు విలపించిన తీరు గ్రామంలో అందరినీ కలిచి వేసింది.

పెళ్లి పేరెత్తితే చంపుతానంటాడు!

- స్పందన కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధిత మహిళ



ఎస్పీ మాధవరెడ్డికి సమస్య వివరిస్తున్న మహిళ

కొత్తచెరువు: పెళ్లి పేరుతో తనను నమ్మించి శారీరక అవసరాలు తీర్చుకున్న తర్వాత ముఖం చాటేస్తున్నాడని, పెళ్లి చేసుకోమంటే చంపుతానని బెదిరిస్తున్నాడంటూ ఎస్పీ మాధవరెడ్డి ఎదుట ఓ మహిళ కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి ఆమె ఫిర్యాదు చేసి, సమస్య తీవ్రతను వివరించారు. జూనియర్ లాయర్‌గా పనిచేస్తున్న తనకు మడకశిరలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న లోక్‌నాథ్ మామ వరుస అవుతాడని వివరించారు. వివాహమైన అతనికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్నారు. ఐదేళ్లుగా తన వద్దకు వచ్చే క్లయింట్ల డాక్యుమెంట్లను రాసిస్తూ సహకరించేవాడన్నారు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు శారీరక అవసరాలు తీర్చుకున్నాడన్నారు. పెళ్లి చేసుకోవాలని ప్రాధేయపడుతుంటే కాదూకూడదంటున్నాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరిస్తున్నాడని వాపోయారు. దీనిపై మడకశిర పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు.

- అదనపు కట్నం కోసం తనను చిత్ర హింసలు పెడుతున్నారంటూ ఎస్పీకి తాడిమర్రికి చెందిన గౌతమి ఫిర్యాదు చేసింది. ఆరు నెలల క్రితం తనను రాజ్‌కుమార్ అనే వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకున్నాడని, కొద్ది రోజులు బాగానే చూసుకున్నా.. ఆ తర్వాత కుటుంబసభ్యులతో కలసి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ వాపోయింది.
- కాగా, జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 51 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా అర్జీలు స్వీకరించి, సమస్య తీవ్రత తెలుసుకున్నారు. చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి, ఎస్‌బీ సీఐ రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.